ఆగిన అభివృద్ధి వెలుగులు

- గత ప్రభుత్వంలో వివిధ నిర్మాణాలు ప్రారంభం
- నేడు కూటమి ప్రభుత్వంలో నిర్లక్ష్యం
- పనులు చేయకుండా వదిలేసిన వైనం
- ప్రజలకు తప్పని ఇక్కట్లు

నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టించింది. ప్రజలకు ఉపయోగపడే వివిధ కార్యాలయాల నిర్మాణాలు శరవేగంగా జరిగాయి. వివిధ కారణాలతో ఆగిన కొన్ని పనులను పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఎన్నికల సమయంలో ఎన్నో మాటలు చెప్పిన చంద్రబాబు ఇప్పుడు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజానీకం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

మనుబోలు: గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఊరూరా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు తదితరాల నిర్మాణానికి నడుం బిగించింది. మండలంలో 14 సచివాలయాలకు గానూ ఏడు కొత్త భవన నిర్మాణాలు గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. ప్రజలకు సేవలందిస్తున్నాయి. వివిధ కారణాలతో నిర్మాణ దశలో ఆగిన భవనాలను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.


ఆగిపోయిన పీహెచ్‌సీ నిర్మాణం

నిధుల కొరత

మనుబోలులో ప్రస్తుతం ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రోగులకు సరిపోవడంలేదు. దీంతో 24 గంటలూ అందుబాటులో ఉండేలా కొత్త భవనాన్ని రూ.1.30 కోట్ల అంచనాలతో నిర్మాణం ప్రారంభించారు. కూటమి ప్రభుత్వంలో నిధుల కొరతతో నిర్మాణం కొనసాగడం లేదు. మనుబోలు - 1, మనుబోలు - 2, చెర్లోపల్లి, వీరంపల్లి, అక్కంపేట, వెంకన్నపాళెం, పిడూరు గ్రామాల సచివాలయాలు గతంలోనే పూర్తవగా మిగతావి ఆగిపోయాయి. త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.



నిర్మాణ దశలోనే చెరుకుమూడి, మడమనూరు సచివాలయాలు

సచివాలయం లేక ఇక్కట్లు


మా గ్రామంలో సచివాలయానికి సొంత భవనం లేకపోవడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ భవనంలోనే సచివాలయాన్ని నిర్వహిస్తున్నాం. ఆగిపోయిన నిర్మాణాలను కొత్త ప్రభుత్వం ఎప్పుడు మొదలు పెడుతుందో అర్థం కావడం లేదు. త్వరితగతిన నిధులు కేటాయించి నిర్మాణాలు పూర్తి చేయాలి.

– ఆవుల తులసీరాం, ఉప సర్పంచ్, జట్ల కొండూరు

అద్దె భవనాల్లోనే..


మడమనూరులో పంచాయతీకి సొంత భవనం లేదు. గత ప్రభుత్వ హయాంలో సచివాలయం కోసం రెండు అంతస్తుల భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. దాని నిర్మాణం ప్రస్తుతం రూఫ్ లెవల్ వరకూ వచ్చి ఆగిపోయింది. దీంతో సచివాలయం, ఆర్‌బీకేలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– ఎం.ప్రదీప్‌రెడ్డి, మడమనూరు

ఆదేశాలు రాలేదు

మండలంలో ఏడు సచివాలయాల పరిధిలో సచివాలయాలు, ఆర్‌బీకే భవనాలు వివిధ దశల్లో ఆగిపోయాయి. నిర్మాణాల కొనసాగింపుపై మాకు ప్రభుత్వం నుంచి ఇంత వరకూ ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– రాజశేఖర్, ఏఈ, పీఆర్

క్లుప్తంగా

హుండీ కానుకల లెక్కింపు


పొదలకూరు: పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి (శివాలయం) ఆలయంలో హుండీ కానుకల లెక్కింపును సోమవారం నిర్వహించారు. ఈఓ ప్రసాద్‌రెడ్డి గ్రామపెద్దల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తొమ్మిది నెలల కాలంలో రూ.1,28,334 వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు ప్రసాద్‌స్వామి, ఎండోమెంట్ నెల్లూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుధీర్, అర్చకుడు కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ


వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్

పొదలకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. భూ వివాదాలు, కౌలతలు, పాస్ పుస్తకాలకు సంబంధించిన సమస్యలపై రైతుల నుంచి తహసీల్దార్ బి.శివకృష్ణ వినతులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీలు పెద్ద సంఖ్యలో రావడం లేదన్నారు. వచ్చిన వినతిపత్రాలను వీఆర్వోలకు అందజేసి వెంటనే పరిష్కరించాల్సిందిగా సూచించారు.

వీరభద్రస్వామికి విశేష పూజలు


మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలులోని వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

గీతాంజలిలో హ్యాకథాన్


కోవూరు : గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఒక్కరోజు హ్యాకథాన్ (కోడింగ్ ఈవెంట్) కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కె.సందీప్‌కుమార్ మాట్లాడుతూ హ్యాకథాన్ ద్వారా ప్రధానంగా ఏఐ, బ్లాక్ చైన్, మెషీన్ లెర్నింగ్ వంటి ప్రాజెక్టులు రూపొందించేందుకు ఉపయోగపడుతుందని తెలియజేశారు. అనంతరం పోటీలో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ వి.గాయత్రి, ఏఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ పి.నాగేంద్రకుమార్, సీఎస్అండ్‌డీఎస్ విభాగాధిపతి టి.సాయిప్రసాద్‌రెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ ఆర్.రజిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త తీయరా..!


బ్రహ్మదేవి సెంటర్‌లో పేరుకుపోయిన చెత్త

ముత్తుకూరు: గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగం రానురానూ పెరిగిపోతోంది. దానికి సంబంధించిన చెత్త ఎక్కడ చూసినా దర్శనమిస్తోంది. మద్యం షాపులకు అనుబంధంగా బెల్టు దుకాణాలు తోడయ్యాయి. ఫలితంగా ప్లాస్టిక్ వినియోగం పెరిగింది. షాపులున్న చోట ప్లాస్టిక్ వ్యర్థాలు కుప్పలుగా పెరుగుతున్నాయి. పంచాయతీలకు ఈ చెత్త తొలగించే కార్యక్రమం భారంగా మారింది. దీంతో నెలల తరబడి కుప్ప తొట్ల వద్ద చెత్త గుట్టల్లా పెరిగిపోతోంది.

వాలీబాల్ పోటీలు

కలువాయి: సంక్రాంతి సందర్భంగా కలువాయి యూత్ ఆధ్వర్యంలో నాలుగు మండలాల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బి.నాగరాజు సోమవారం తెలిపారు. కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 10 నుంచి 13వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు.

సదయ్యకు నివాళి

ముత్తుకూరు: సీపీఎం సీనియర్ నేత దేవారెడ్డి సదానందరెడ్డి అంత్యక్రియలు సోమవారం జరిగాయి. ఆయన భౌతికకాయంపై సీపీఎం పతాకాన్ని కప్పారు. ఆ పార్టీ జిల్లా నాయకుడు మూలం రమేష్, మండల నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు హాజరై నివాళులర్పించారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

- డీఎల్‌పీఓ రమణయ్య

పొదలకూరు: మండలంలోని తాటిపర్తిలో జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో వారంరోజులపాటు స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశామని నెల్లూరు డీఎల్‌పీఓ రమణయ్య పేర్కొన్నారు. ఆ గ్రామంలో పారిశుద్ధ్యాన్ని సోమవారం డీఎల్‌పీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీపీఓ ఆదేశాల మేరకు గ్రామంలో రోడ్లపై చెత్తాచెదారం, పేడదిబ్బలను తొలగించాలని సూచించామన్నారు. మురుగు కాలువల్లో పూడికను తొలగిస్తున్నట్లు వెల్లడించారు. వాటర్ ట్యాంక్‌ల్లో క్లోరినేషన్ చేయించాల్సిందిగా సెక్రటరీని ఆదేశించామన్నారు. డీఎల్‌పీఓ వెంట సెక్రటరీ బాలకృష్ణయ్య, ఉప సర్పంచ్ పామూరు లచ్చారెడ్డి తదితరులున్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ జి.వసంతకుమారి సోమవారం తనిఖీ చేశారు. మెనూ కచ్చితంగా అమలు చేస్తున్నారా.. లేదా? అని పరిశీలించడంతోపాటు విద్యార్థుల హాజరు, భోజనానికి హాజరైన విద్యార్థుల్లో వ్యత్యాసాలపై ఆరా తీశారు. ఆమె వెంట హెచ్‌ఎం ఎ.మోహన రామలింగయ్య, సీఆర్‌ఎంటీ ఎం.దయాకర్‌లు ఉన్నారు.

కాకాణిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు


గోవర్ధన్‌రెడ్డితో నాయకులు

పొదలకూరు: మండలంలోని బిరదవోలు పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం రాత్రి నెల్లూరులో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరథరామయ్య గౌడ్, వెన్నపూస దయాకర్‌రెడ్డి, బడుగు శ్రీనివాసులు, ఇంద్రసేన్ గౌడ్, మోహన్ రెడ్డి, వెంకట్రావ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి


కరపత్రాలను ప్రదర్శిస్తున్న నాయకులు

తోటపల్లిగూడూరు: సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య కోరారు. సోమవారం నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరు నగరంలోని కస్తూరిదేవి కళాక్షేత్రంలో సభలు జరుగుతాయన్నారు. వీటిని తెలుగు రాష్ట్రాలతోపాటు అనేక రాష్ట్రాల నుంచి ముఖ్యనేతలు తరలిరానున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వేగూరు వెంకయ్య, కాల్తిరెడ్డి రమణమ్మ, బండి శౌరి, పచ్చ మధు, ఉంద్రాళ్ల శ్రీనివాసులు, ఇనమాల కొండయ్య, నాగయ్య, వీరయ్య, చలపతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వరి పొలాల పరిశీలన


గొలగమూడిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెంకటాచలం: మండలంలోని గొలగమూడి, కంటేపల్లి, తిక్కవరప్పాడు, అనికేపల్లి గ్రామాల్లో వరి పొలాలను సోమవారం వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్.శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిసాగులో నత్రజని వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. మించి వినియోగించడం వల్ల తెగుళ్లు అధికమవుతాయని తెలియజేశారు. సాగులో ఆధునిక పద్ధతుల గురించి రైతులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శిక్షణ కేంద్రం అధికారులు సి.మారుతీదేవి, పరమశివం, మండల వ్యవసాయశాఖాధికారి హరి కరుణాకర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు అభిషేక్, ప్రత్యూష, సందానీబాషా, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఖాదర్‌వలీ

ఇందుకూరుపేట : వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన వైద్యం అందించాలని జిల్లా అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సిబ్బంది విధుల్లో ఉండేలా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులదేనని చెప్పారు. అనంతరం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కిశోర్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, డీపీఎం విజయ్‌కుమార్, హెచ్‌ఈఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


మునిలోకేశ్‌ను అభినందిస్తున్న జోనల్ ఇన్‌చార్జి

వెంకటాచలం: నాయుడుపేటలో ఆదివారం జరిగిన ఎస్ఎస్ఎఫ్ 7వ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న రవీంద్రభారతి స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. 9వ తరగతి చదువుతున్న మునిలోకేశ్ 1.,500 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం, వెంకటసాయి 400 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించారు. వారిని సోమవారం రవీంద్రభారతి స్కూల్లో జోనల్ ఇన్‌చార్జి మహేష్, వ్యాయామ ఉపాధ్యాయులు సాయికుమార్, మహేష్, సాయిచరణ్‌లు అభినందించారు.

మర్యాదపూర్వకంగా..


పూలమొక్కను అందజేస్తున్న నాయకులు

కోవూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా యాక్టివిటీ సెక్రటరీగా నియమితులైన నలుబోలు సుబ్బారెడ్డి మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్క అందించి కృతజ్ఞతలు తెలిపారు. గాజుల మల్లికార్జునరావు, చిరుపాటి శ్రీనివాసులురెడ్డి, జానా గౌడ్, నంబూరు సతీష్, కాకాణి భాస్కర్, కొండా మాల్యాద్రి, కొరెం మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిష్‌కాన్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసులు


నియామకపత్రం అందజేత

కోవూరు: విడవలూరు మండలం పొన్నపూడి లక్ష్మీపురానికి చెందిన భక్తాని శ్రీనివాసులు ఫిష్‌కాన్ (మత్స్యకార సంఘం) జిల్లా అధ్యక్షుడిగా సోమవారం నియమితులయ్యారు. ఈ మేరకు నెల్లూరులోని ఫిష్‌కాన్ కార్యాలయంలో డైరెక్టర్ ప్రళయ కావేరి వేణుగోపాల్ సోమవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం కోసం కృషి చేస్తామని వివరించారు.

దారి దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్

- రూ.4 లక్షల నగదు రికవరీ

పొదలకూరు: మూడేళ్ల క్రితం జరిగిన దారి దోపిడీ కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి నగదు, మరో కేసులో బంగారాన్ని రికవరీ చేశారు. సోమవారం పొదలకూరు సీఐ ఎ.శివరామకృష్ణారెడ్డి వివరాలు వెల్లడించారు. నెల్లూరు నగరానికి చెందిన షేక్ మస్తాన్‌వలీ, జడపల్లి సుబ్బరాయుడు కలిసి 2021 జూలై 7వ తేదీన పొదలకూరు మండలం నరసింహకండ్రిక గ్రామం వద్ద దారి దోపిడీకు పాల్పడ్డారు. మర్రిపాడు మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన దివనం ప్రసాద్ కోళ్లను చికెన్ షాపులకు వేసి నగదు తీసుకెళ్తుండగా నిందితులిద్దరూ బైక్‌పై వెంబడించి బాధితుడితో గొడవ పెట్టుకుని రూ.11,50,000 దోచుకెళ్లారు. అప్పటి నుంచి పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం నిందితులు పొదలకూరుకు సమీపంలో చిట్టేపల్లి రోడ్డు వద్ద ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు విచారణలో కోళ్ల విక్రయాలకు సంబంధించిన నగదు దోపిడీతోపాటు మనుబోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో గతేడాది దొంగతనానికి పాల్పడినట్టు తెలిపారు. దీంతో పోలీసులు దారి దోపిడీ కేసులో రూ.4 లక్షలు, మోటారుబైక్, మనుబోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం కేసులో బంగారు బుట్టకమ్మలు, చెవి రింగులు రికవరీ చేశారు. సీఐ పర్యవేక్షణలో నిందితులను గూడూరు కోర్టులో హాజరుపరిచారు.

గొలగమూడిలో ముగిసిన క్రీడా పోటీలు


విద్యార్థినులకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు, అతిథులు

వెంకటాచలం: మండలంలోని గొలగమూడి వద్దనున్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న జోనల్ స్పోర్ట్స్ మీట్ సోమవారంతో ముగిసింది. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను గొలగమూడి పాఠశాల విద్యార్థినులు కైవసం చేసుకున్నారు. విజేతలకు ఎస్ఆర్‌కే స్కూల్ కరస్పాండెంట్ పి.కృష్ణమూర్తి, వెంకటాచలం సీఐ సుబ్బారావు, గొలగమూడి బీసీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వీవీ రమణప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ


పంపిణీ చేసిన సైకిళ్లతో విద్యార్థినులు, ఎస్బీఐ సిబ్బంది

కొడవలూరు: నెల్లూరు ఎస్బీఐ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ హైస్కూల్లో ప్రతిభ చూపుతున్న పదిమంది విద్యార్థినులకు సోమవారం సైకిళ్లను పంపిణీ చేశారు. వీటిని ఎస్బీఐ రీజినల్ మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు విద్యపై దృష్టి సారిస్తే ఉన్నత చదువులకు బ్యాంక్ సాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్బీఐ అధికారులు సురేష్ మిశ్రా, ఉదయ్ కిషన్, లక్ష్మీప్రసన్న, బాబు ప్రసాద్, ఎంఈఓ జి.వసంతకుమారి, హెచ్‌ఎం ఎ.మోహన రామలింగయ్య, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాటకం తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడలో హుండీ కానుకల లెక్కింపు


బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలోని కామాక్షితాయి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ అరభూమి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఆలయంలోని హుండీల ద్వారా 68 రోజులకు రూ.33,24,467లు, అన్నదాన సత్రంలోని హుండీ ద్వారా రూ.2,30,057లు వచ్చాయని తెలిపారు. అంతే కాకుండా 67 గ్రాముల బంగారం, 190 గ్రాముల వెండి, 41 అమెరికన్ డాలర్లు భక్తులు హుండీలో వేశారన్నారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్లు ఆర్.కృష్ణయ్య, ఎస్.శ్రీధర్‌నాయుడుతో పాటు బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుగా పంచాయతీ దొరువు


డంపింగ్ యార్డుగా మారిపోయిన ఇస్కపాళెం పంచాయతీ దొరువు

తోటపల్లిగూడూరు: మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ పరిధిలో ఉన్న పంచాయతీ దొరువు క్రమేణా డంపింగ్ యార్డుగా మారుతోంది. 40 సెంట్ల విస్తీర్ణంలో ఉండే ఈ దొరువు ఆక్రమణల కారణంగా ప్రస్తుతం 30 సెంట్లకు చేరింది. మూగజీవాల దాహార్తిని తీరుస్తున్న ఏకైక వనరు ఈ పంచాయతీ దొరువే. దీని పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారుతోంది. చెత్తాచెదారాలను నిబంధనలకు విరుద్ధంగా ఈ దొరువులో వేస్తున్నారు. తోటపల్లిగూడూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా, ప్రధాన రహదారి ఆనుకునే ఇది ఉండటంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పచ్చని పూలమొక్కలతో నీటికుండలా ఉండే ఈ దొరువు నేడు డంపింగ్ యార్డుగా మారుతుండటంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిరక్షించాల్సిన అవసరం ఉంది.